# కథల కథ

ఇన్నాళ్ళుగా ఎదురుచూసిన రోజు, జీవితంలో మరపురాని రోజు, జీవితాని కాచావల్సిన రోజు వచ్చింది. గుండెల్లో కోయిల కూసిన రోజు, తల్చుకుంటేనే ప్రతి అణువణువూ పరవశించే రోజు, వెన్నెల విరిసిన రోజు మల్లియ నవ్విన రోజు వచ్చింది. మనసూయల లూగే రోజు, వయసు ఉరకలు వేసే రోజు వచ్చింది, తన జీవితానికి వింత వెలుగు నిస్తూ వచ్చింది. తన బ్రతుకు బండికి పూలబాట పరుస్తూ వచ్చింది. ఎలా? ఇంత ఆనందాన్ని భరించడం ఎలా? ఎవరితో చెప్పుకుని పంచుకోవాలి? అమ్మతోనా? ఉహూ! .... సిగ్గేస్తుంది. ఎలా చెప్పాలి? నాన్నగారితోనా? అమ్మో! ఆయన ముందసలు నోరే పెగ లదు ఇటువంటి విషయం సిగ్గువిడిచి చెప్పడానికి. పట్టలేని సంతోషంతో పెరట్లో విరజాజి పందిరి దగ్గిరికి పరిగెత్తింది ద్వారక. పచ్చని ఆకుల్లో తెల్లగా ముత్యాలు పొదిగినట్టు మెరుస్తున్నాయి విరజాజులు. మత్తయిన వాసన పిల్లగాలుల్తో కలిసి గిలిగింతలు పెడుతోంది. వాతావరణం చల్లగా ప్రశాంతంగా మనసుకి ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. నీతోనే నా ఆనం దాన్ని పంచుకుంటా నన్నట్టుగా విరజాజి పువ్వొటి కోసి మత్తుగా వాసన చూసి జడలో తురుముకుంది ద్వారక. వెనకనించి పైటచెంగు ముందుకి తీసి పువ్వులు కొయ్యడం మొదలు పెట్టింది, ఒక్కొక్క పువ్వూ కోస్తుంటే గతంలో జరిగిన ఒక్కొక్క సంఘటనా కళ్ళముందు మెదిలింది.

తను పుట్టగానే 'ఒరేయ్! మీ ఆవిడ పుట్టిందిరా' అన్నారుట బావతో పెద్దలంతా. బుద్ధి తెల్సినప్పటినించీ పెద్దవాళ్ళంతా అనే మాటలు

వింటూ బావకీ తనకీ పెళ్ళయి పోయినట్టే ఊహించుకునేది తను. బావకి తనంటే ఇష్టముందో లేదో తనకి తెలిసేదికాదు. కానీ అయిష్టం మాత్రం లేదని గ్రహించుకుంది. తన చెల్లెల్తో ఎలా మాట్లాడేవాడో, ఎలా ఆట్లాడేవాడో అలాగే తనతోనూ ప్రవర్తించేవాడు. ఎక్కువాలేదు తక్కువాలేదు. కోపమొస్తే తన బుగ్గ గిల్లేవాడు. చెప్పినట్టు వినకపోతే తన నెత్తిన మొట్టేవాడు. స్నేహితులు తనని వేళాకోళం చెయ్యడానికి బావ పేరెత్తితే తన బుగ్గల్లో కెంపులు మెరవకపోయినా గుండెల్లో గర్వం తొంగి చూసేది. ఎదుగూ బొదుగూ లేని బడి పంతు లుద్యోగంతో బండిని లాగేవాడు తండ్రి. నలుగురు కూతుళ్ళకి పెళ్ళిళ్ళుచేసి పంపి నెత్తిన గుడ్డ వేసుకున్నాడాయన. ఇంక మిగిలింది తను. అక్కయ్యలు ఎలిమెంటరీ స్కూలు దాటలేదు. కానీ .... తను .... ఏడ్చి పంతంపట్టి ఎలాగైతేనేం సాధించింది. ఆపకుండా చదువు కొనసాగిస్తోంది. ఎస్. ఎస్. ఎల్. సి. చదువుతుండగా కథలు రాయాలనే పిచ్చి పట్టుకుంది. ఆ పిచ్చి పట్టుకోకుండా ఉండాలేగానీ పట్టుకుంటే వదలదు. మనసులో భావాలు కాగితంమీద పెడితేగానీ కంటికి నిద్ర రాదు. మనసుకి ప్రశాంతత ఉండదు. పైకి చెప్పుకోలేని ఆవేదన లాంటిదది. రాసిన మొట్టమొదటి కథే అచ్చయింది. పట్టలేని సంతోషం, ఏదో తెలియని తృప్తి. కానీ .... కానీ అదే తన సంతోషాన్ని నేలమట్టం చేస్తుందని, తన జీవితాని కదే ఓ పెద్ద మలుపని ఊహించలేకపోయింది. ఎమ్. బి. చదువుతున్న బావ అపుడు సెలవలకి ఇంటికి వచ్చినప్పుడు, అమ్మా నాన్నా ఇంట్లో లేకుండా చూసి తనతో మాట్లాడా లన్నాడు. ఏవిటో ఆ రహస్యమని సిగ్గుతో, ఆతృతతో వెళ్ళింది గదిలోకి. 'నీ కథ చదివాను ద్వారకా! అప్పటినించీ కూడా నీ కుత్తరం రాయా లనుకున్నాను గానీ ఇది ఉత్తరాల్లో రాసే విషయం కాదు. ముఖాముఖి మాట్లాడితేనే ఒకళ్ళ కొకళ్ళు బాగా అర్థమవుతారని ఈరోజు వరకూ ఊరుకున్నాను.' అంటూ ఒక్కక్షణం చెప్పడం ఆపాడు బావ. ఆ ఒక్క క్షణంలోనూ వెయ్యి సందేహాలు చుట్టి ముట్టి ఉక్కిరి బిక్కిరి చేశాయి. 'నువ్వు నన్నర్థం చేసుకో

గలవని నాకు నమ్మకం ఉంది. అసలు నిజం చెప్పాలంటే నీ కథే నా సమస్యకి పరిష్కార మార్గం చూపించింది. నేను మా కాలేజ్‌మేట్ సరళని ప్రేమించాను. సరళకూడా నేనంటే ఎంతో ఇష్టం. మేమిద్దరం పెళ్ళి చేసుకోవా లనుకున్నాం. కానీ చిన్నతనంనించీ మనిద్దర్నీ భార్యాభర్తలుగా ఊహించుకుని సంబర పడుతున్నారు పెద్దవాళ్ళు. అలాగని వాళ్ళకోసం మనసుని చంపుకోవాలా? మనసు కలిసిన మనువుకోసం ధైర్యంగా ముందడుగు వెయ్యాలా? అన్నదే నా సమస్య అయి కూర్చుంది. 'మనసులు కలవడం ముఖ్యం కానీ పెద్దల మాటలు, పట్టింపులు ముఖ్యం కాదని బోధ చేశావు నీ కథలో. నీ కథ చదవకముందు ఎలాగా నీతో ఈ విషయం చెప్పడం, నీ మనసు కష్టపడుతుందేమోనని ఎంతో బాధ పడ్డాను. కానీ నీ కథ చదివాక నువ్వు నన్ను అర్థం చేసికోగలవని, పరిస్థితి గ్రహించగలిగే హృదయం నీకుందని, నువ్వీ విషయాన్ని తేలిగ్గా తీసికో గలవని అనిపించింది నాకు.' బావ మాటలు విన్న తన గుండె ఇంకా ఎందుకు ఆగిపోలేదో, తన కోరికలు, కలలతోపాటూ తను కూడా ఎందుకు నిర్జీవం కావట్లేదో అర్థం కాలేదు తనకి. మరి ఒక్క క్షణం అక్కడ నిలబడలేక రెండుచేతుల్లోనూ ముఖం దాచుకుని గదిలోకి పరిగెత్తి మంచంమీద వాలిపోయింది తను. సరళతో బావ పెళ్ళి అయిపోయింది. అమ్మా నాన్నల కోప తాపాలతో ఆ ఇంటిమీది కాకి ఈ ఇంటిమీద వాలడం మానేసింది. గుండె రాయి చేసుకోక తప్పలేదు తనకి. కాలేజీలో చేర్పించడం ఇష్టం లేకపోయినా, బాధ మర్చిపోవాలని అడగ్గానే కాలేజీలో చేరడానికి ఒప్పుకున్నాడు తండ్రి. బి. ఎ. మొదటి సంవత్సరం చదువుతుండగా ఓ కథ అచ్చయింది. అది అచ్చయిన రోజు రాత్రి అమ్మతో నాన్నగారు అన్న మాటలు ఇప్పటికీ తనకి గుర్తున్నాయి.

'అమ్మాయి రాసిన కథ చదివావా? తల్లి తండ్రుల్ని ఆదుకునేందుకు కొడుకైతేనేం కూతురైతేనేం కొడుకు లేనివాళ్ళకి కూతురే కొడుకని అర్థం వాచ్చేటట్టుగా ఎంత బాగా రాసిందో చూడా కథ. దాని మనసు నాకు బాగా తెల్సు. మనకి కొడుకుల్లేని లోటు అదే తీరుస్తుంది.

మనసీ వయసులో అదుకునే దదొక్కటే. బి. ఎ. పూర్తవగానే ఉద్యోగంలో చేరిందంటే నీకూ నాకూ కూడా అనరాయే,' ఆ క్షణంలో న్నాన్నగా రన్న ఆ మాటలు విని అచేతనంగా గోడ కానుకు నిలబడి పోయింది తను. 'ఏవిటండీ మీరనేది? ఆ చదువేదో పూర్తవగానే ఇంక దానికి పెళ్ళి చెయ్యరా ఏవిటి? ఆడపిల్ల ఉద్యోగం చెయ్యడం మన ఇంటా వంటా లేదు.' ఆవేదన అమ్మచేత అనిపించిన మాటలు. 'కాలేజీ చదువులు ఆడపిల్ల చదవటం మాత్రం మన ఇంటా వంటా ఉందా నువ్వే చెప్పు. అయినా మరి మనం దాన్ని చదివిస్తున్నామా లేదా? మారుతున్న కాలంతో మారక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు కూచుంటామా చెప్పు. ఆ రథ చదివినా కూడా దాని మనసు, దాని ఉద్దేశం నీకు తెలియలేదా?' అన్న ఆయన మాటలు విని తల తిరిగినట్టయింది తనకి. 'భగవాన్! తన క్కావల్సిందదా? ఉద్యోగం చెయ్యాలని తను ఉబలాట పడుతోందా? తనకి మరొకతోడు కావాలని, తను మరొకరికి నీడ అయిపోవాలని అనుకోక ఉద్యోగంచేస్తూ ఉండిపోవాలని తనెన్నడూ అనుకోలేదే! తప్పనిసరి పరిస్థితుల్లో అటువంటి జీవితమే తటస్థ పడితే చేసేదిలేక రాజీ పడుతుందే తప్ప ఏ ఆడది కోరుకుంటుంది అటువంటి కన్నె జీవితం కావాలని. గిల గిల లాడింది తన మనసు. చదువు పూర్తవగానే ఉద్యోగానికి అప్లయి చెయ్యమని కన్న తండ్రి అడిగితే, కాదు నేను ఉద్యోగం చెయ్యను. నాకు పెళ్ళి చెయ్యమని తనంత తానుగా సిగ్గు విడిచి ఎలా అడగగలదు. ఈ సమస్యకి పరిష్కార మేదన్న ఆలో చన మనసుని తినేస్తోంది.

కాలేజీలో హిస్టరీ లెక్చరరు భానుమూర్తిగారు రోజూ తనవంక అదోలాచూడటం, రోజుకో సారైనా తప్పకుండా తనతో మాట కలపడానికి ప్రయత్నిస్తుండటం గమనించింది తను. ఆయనెందుకలా చూస్తాడని కోపం వచ్చినా లోపలేదో ఆశ చిగుళ్ళు వెయ్యడం మొదలు పెట్టింది. తనంటే ఇష్టమేమో ఆయనకి, తనని ప్రేమిస్తున్నాడేమో, ఏదో ఒక రోజు హఠాత్తుగా "పెళ్ళి చేసుకుంటాను ద్వారకా విన్నా" అంటాడేమో అన్న ఆలోచన మెల్లి మెల్లిగా మనసంతా అల్లుకుపోసాగింది,

తీయని ఊహలేవో అల్లరి పెట్టసాగాయి. కానీ మరికొన్నాళ్ళకే అనుకోని పరిస్థితి ఎదురైంది. ఆ రోజు విమల, సుశీలతో చెప్తుంటే తన చెవుల్లో పడింది. విమల భానుమూర్తిగారి చెల్లెలు. వెయిటింగ్ రూమ్‌లో, సుశీలకి కథలా వినిపించింది విమల. 'సుశీ! నిన్నేం జరిగిందో తెల్సా? మా అన్నయ్య నన్ను పిల్చి ద్వారక రాసిన "రచయిత్రి" కథ చదివావా అంటూ అడిగాడు. చదివానన్నాను. 'నిజంగా దేవుడు నన్ను రక్షించాడు విమలా! ఇన్నాళ్ళబట్టీ ద్వారక నన్ను ఆకర్షించింది. అమ్మతో ఈ సంగతి ఎలా, ఎప్పుడు చెప్పాలి అని ఆలోచిస్తున్నాను. కానీ నేను తొందరపడకముందే ఆవిడగారి మనస్తత్వం తెలియడం మంచిదైంది. ఈ కథలో చూశావా రచయిత్రి హక్కులకోసం మొగుడితో ఎలా పోట్లాడుతుందో. దీంతో ఆ ద్వారక మనస్తత్వం అర్థమైపోవట్లేదూ! అటువంటి పిల్లని కట్టుకోకముందే ఆ పిల్ల మనస్తత్వం తెల్సిపోవడం నా అదృష్టంకాదూ" అంటూ చేతులు జోడించాడన్నయ్య. ఇంకా విమల ఏదో చెపుతూనేవున్నా తనకి మాత్రం మరేమీ వినిపించలేదు. యేదో తనకి తోచిన విధంగా కథ రాసినంత మాత్రాన ఆ కథలో రచయిత్రి ఉద్దేశాలే తనవని ఎందు కపోహపడాలి? ప్రతి స్త్రీకిమల్లేనే పెళ్ళిచేసుకుని సుఖపడాలని, నలుగురిలా సంసారం చేసుకోవాలని తనకి మాత్రం ఉండదూ! తన కథలు చేసేది ఊరికి ఉపకారమూ తన కపకారమూనా! అయినా కూడా కథలు రాయడం తను మానలేకపోతోం దెందుకని' కలవరపడుతూ కుమిలిపోయింది తన మనసారోజంతా.

మూడవ సంవత్సరంలోకి వచ్చింది తను, రోజులు గడిచి పోతూనే వున్నాయి ఆగకుండా.

ఆరోజు పక్కింట్లోకి కొత్తగా దిగారు సుభద్రమ్మా, కొడుకూను. కుతూహలంగా కిటికీలోంచి చూసింది తను. 'అబ్బ! ఎంత అందం! ఎంత ఆకర్షణా ఆ కళ్ళల్లో' అనుకుంది ఆ నవయువకుడిని చూసి. ఒక్కక్షణం ఆ కళ్ళతో తన కళ్ళు కల్సిపోయాయి. అదో రకమైన పులకింత. మరేదో రకమైన గిలిగింత మనసు నూయలూగించాయి. ఆ

క్షణంనుంచీ ఆ కళ్ళనీ, ఆ అందాన్ని మనసులో భద్రంగా దాచుకుంది. పక్కిల్లే అయినా రోజూ అతన్ని తను, తనని అతను చూసుకుంటూనే ఉన్నా ఎప్పుడూ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. మాట్లాడుకునే అవసరం కూడా కలగలేదు. 'నీ కథలు మా అబ్బాయికి చాలా నచ్చుతాయి. నువ్వు కథలు బాగా రాస్తావని నాతో అంటూవుంటాడు.' అని సుభద్రమ్మగారు తనతో ఎన్నిసార్లో చెప్పింది. ఆ మాట విన్నప్పుడల్లా తన మనసు గాలిలో తేలిపోతుంటుంది. పట్టలేని సంతోషంతో లోలోనే పొంగిపోతుంది. అతను తనవాడైపోయినట్టే ఊహాలపందిరి వేసి అలో చనలల్లుకుపోతాయి. ఇందాక సుభద్రమ్మగారు వొచ్చి అమాటా ఈమాటా మాట్లాడుతూ 'పెళ్ళిచేసుకోరా పెళ్ళిచేసుకోరా ! అని యిన్నాళ్ళబట్టీ నేను చెవి విల్లుకట్టుకుని పోరుతుంటే నా మాట లక్ష్యపెట్టలేదు వాడు. ఈ మధ్య నువ్వు రాసిన కథలే మావాడి మనసు మార్చాయని నే నను కుంటున్నాను. నీ కథల్లో 'తోడు—నీడ' వాడి నెక్కువ ఆకట్టుకుంది. ప్రతి మొగాడికి ఒక తోడు, ప్రతి ఆడదానికీ ఒక నీడ అవసరమని యెంతో చక్కగా నిరూపించావు నీ కథలో. మొన్న మధ్య నోకథలోపెళ్ళి చేసుకుంటే మనిషికి జీవితంమీద ఆసక్తి, జీవితంలో వుండేబంధాలు అను బంధాలు తృప్తీ అన్నీ చక్కగా హృదయానికి హత్తుకుపోయేలా రాశావు. నాకు మాత్రం నువ్వే మావాడిలో మార్పు తెప్పించావని గట్టిగా నమ్మకం ఏర్పడిపోయింది. పెళ్ళిచేసుకోను అని భీష్మించు కూర్చున్నవాడల్లా పట్టు సడలించాడు. పెళ్ళిచేసుకోడానికి ఒప్పుకున్నాడు....' అని చెప్తూ మధ్యలో ఎవరో పిలవడంతో లేచి వెళ్ళిపోయిందావిడ. సంతోషంతో తనిలా పరిగెత్తుకుంటూ పెరట్లోకి వచ్చేసింది.

పూలతో చెంగు నిండింది.

మెల్లిగా ఇంట్లోకి నడిచింది.

వరండాలో సుభద్రమ్మతో మాట్లాడుతున్న తల్లిగొంతు విని పించింది.

"పోన్లెండి మీ కింకే బాధా లేదు. అబ్బాయి పెళ్ళి చేసుకుందుకు వొప్పుకున్నాడన్నమాట."

ద్వారక గుండెలదిరాయి.

"ఖచ్చితంగా మీ అమ్మాయి కథలే మావాడిలో మార్పు తెప్పించాయి వొదినగారూ! కన్నెపిల్ల అయినా, పెళ్ళి చేసుకున్నవాడికి జీవితంలో ఒక తృప్తి, ఒక ఆనందం అంటూ వుంటాయని, పెళ్ళిచేసుకోని వాడికి ఎన్నివున్నా జీవితానికి పరిపూర్ణత, ప్రశాంతత అంటూ ఉండవని ఎంత చక్కగా చెప్పిందండీ కథలో...."

"ఆ .... దానిదేం వుందిలెండి .... ఎంతమంది ఎన్ని కథలు రాయల్లేదు...."

"అబ్బే! అలా అనకండి....నిజంగా మనసుకి హత్తుకుపోయేలా రాస్తుంది మీ అమ్మాయి కథలు .... నెల్లూరునుంచో మంచి సంబంధం వొచ్చింది. ఇదిగో....రెండు మూడు రోజుల్లో పెళ్ళి పిల్లని చూసొద్దామన్నాడు. అన్నీ సవ్యంగా కుదిరితే వొచ్చే నెల్లోనే ముహూర్తం."

ఆ తర్వాత ఇంకేమీ వినిపించలేదు ద్వారకకి.

నెత్తిమీద పిడుగుపడినట్టయింది.

కాళ్ళకింద భూమి కంపించింది.

కన్న కలలన్నీ నేలమట్ట మయ్యాయి.

అప్రయత్నంగా చేతులు జెంగుని వొదిలేశాయి.

విరిసిన విరజాజులు విలపించే ద్వారకని చూసి విస్తుపోయాయి.

★